క్లుప్తంగా

చెక్కులు పంపిణీ

ఇల్లెందు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేశారు. పట్టణంలో 16 మందికి రూ.5.10 లక్షలు, మండలంలో 63 మందికి రూ. 19.26 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

జిల్లా వాలీబాల్ జట్టులో స్థానం

పాల్వంచరూరల్: రాష్ట్రస్థాయి అండర్–19 వాలీబాల్ జట్టులో పాల్గొనే జిల్లా జట్టులో కిన్నెరసాని డ్యామ్‌సైడ్‌లోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి డి.విజయ్‌కు చోటు లభించింది. ఇటీవల ఎంపిక చేసిన జట్టులో 9వ తరగతి చదువుతున్న విజయ్ స్థానం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.శ్యాం కుమార్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, పీఈటీ రాకేష్, పీడీ నాగార్జున, ఉపాధ్యాయులు బుధవారం విజయ్‌ను అభినందించారు.

మైక్ సెట్ వితరణ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పోలారం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మోడెం ప్రశాంత్ రూ.10వేల విలువ చేసే మైక్‌సెట్‌ను బుధవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలకు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా తాను ఈ సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు లింగానాయక్, దుర్గాప్రసాద్, ప్రభుసింగ్, భాస్కర్, సత్యనారాయణ, వీరు, త్రివేణి, నర్సింహారావు, భీమా, నవత, రాంబాబు, నేహా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కొత్తగూడెంఅర్బన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. సుజాతనగర్ మండలం సింగభూపాలెం మాజీ ఎంపీటీసీ తీట్ల భాస్కరరావు, కొత్తగూడెం సొసైటీ మాజీ డైరెక్టర్ వజ్జా రామారావుతో పాటు అబ్బులు, పద్దం భుజంగరావు, వజ్జా శ్రీను, ముక్తి వీరబాబు, పాయం నాగేంద్ర బాబు, బొర్రా కృష్ణ, ఊకే రామనాథం, చందు తదితరులు పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్ల మురళి, చింతలపూడి రాజశేఖర్, మండె హనుమంతరావు, నాగేంద్ర త్రివేది, షేక్ అబీద్, మడిపల్లి శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హీరాలాల్‌కు స్వాగతం

జూలూరుపాడు: జై ఆదివాసీ యువశక్తి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హీరాలాల్ హల్వాకు పడమటనర్సాపురం గ్రామంలో ఆదివాసీలు, కులపెద్దలు బుధవారం ఘన స్వాగతం పలికారు. జిల్లా పర్యటనలో భాగంగా మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే హీరాలాల్ పడమటనర్సాపురం గ్రామంలో ఆగారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసమ్మక్క–సారలమ్మ గద్దెలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కత్రం నరసింహారావు, కాలం నరసింహారావు, ఇరప రామారావు, ఎదళ్లపల్లి వీరభద్రం, కళాశ్రీ దంపతులు, సిద్దెబోయిన పుల్లారావు పాల్గొన్నారు.

18న 'చలో తిరుపతి'

పాల్వంచ: 18, 19 తేదీల్లో తిరుపతిలో జరగనున్న హథీరామ్ బావాజీ మహాభోగ్ బండారో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగదాంబ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ రాములు నాయక్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు మాట్లాడారు. రమేష్ నాయక్, బాలాజీ సాధు, దేశ సాధు, రాందాస్, నీలాబాయి పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సీపీఐ మద్దతు

ఇల్లెందు: బీసీ సంఘాల జేఏసీ పిలుపులో భాగంగా ఈ నెల 18న జరగనున్న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ కోరింది. బుధవారం ఇల్లెందులో సీపీఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కె.సారయ్య, డి.శంకర్, బి.నాగయ్య, బి.సత్యనారాయణ, కొమురయ్య, ఉడుత ఐలయ్య, వడ్ల శ్రీను, జయరాజు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ఎప్పుడో..?

- పత్తిని తరలించుకుపోతున్న దళారులు
- ఇష్టారాజ్యంగా చిల్లర కౌంటర్లు
- ధర దక్కక మోసపోతున్న రైతులు



టేకులపల్లి సబ్ మార్కెట్

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ఈ ఏడాది 33వేల ఎకరాల్లో పత్తి సాగు అయింది. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. పత్తి తీత పనులు సాగుతున్నాయి. వర్షాల కారణంగా కొంతమేర నాణ్యత తగ్గినా దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ఇదే అదనుగా భావించిన దళారులు మాయమాటలు రైతులను నమ్మబలికి పత్తిని తరలించుకుపోతున్నారు. మరోవైపు మండలం వ్యాపితంగా ఇష్టారాజ్యంగా పత్తి కొనుగోలు కేంద్రాలు వెలిశాయి. మండలంలో పండించిన పత్తి దళారుల వశం అవుతున్నా మార్కెట్ యార్డు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గర్హనీయం. టేకులపల్లి మండలంలో 15 మంది లైసెన్స్ పొందిన వ్యాపారులు ఉండగా ఇప్పటికే టేకులపల్లి సబ్‌యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ నేటికీ ప్రారంభం కాకపోవడంతో దళారులకు వరంగా మారింది. మార్కెట్ యార్డు నుంచి కార్యదర్శి ఆధ్వర్యంలో సిబ్బంది టేకులపల్లి మండలంలోని పత్తి చేలల్లో రైతులను కలిసి పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు అవగాహన కల్పించారు. కానీ, త్వరితగతిన టేకులపల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు.

ఒక్క పంటకే రూ.కోటి టర్నోవర్...

ఇల్లెందు మార్కెట్ యార్డు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా టేకులపల్లి సబ్‌యార్డులో ఫిబ్రవరి 17న మిర్చి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. 28 రోజుల్లో 311 మంది రైతుల నుంచి 2,949 బస్తాలు అనగా 983.67 క్వింటాళ్ల మిర్చి పంటను కొనుగోలు చేశారు. తద్వారా ఏఎంసీకి రూ.కోటి రూపాయల టర్నోవర్ లభించింది. ఇలా ఒక్క పంటకే ఇంత టర్నోవర్ వస్తే అన్నిరకాల పంటల కొనుగోళ్లు ప్రారంభిస్తే రెట్టింపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో టేకులపల్లి మండలంలో వరి 6,500, మొక్కజొన్న 12,500, మిర్చి 1,500 ఎకరాల్లో సాగు చేశారు. మార్కెట్ కమిటీ అధికారులు స్పందించి పత్తి రైతులు నష్టపోకుండా వెంటనే పత్తి కొనుగోలు ప్రారంభించాలని, ఆ తరువాత వరి, మిర్చి, మొక్కజొన్న పంటలు కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

కొనుగోళ్లు ప్రారంభించాలి..



మండలంలో 33 వేల ఎకరాల్లో పత్తి సాగయింది. ఇప్పటికే పత్తితీత పనులు ప్రారంభం అయ్యాయి. గ్రామాల్లో చిల్లర కౌంటర్లు వెలిశాయి. దీంతో మార్కెట్ ఆదాయాన్ని కోల్పోతోంది. అధికారులు మీన మేషాలు లెక్కించకుండా టేకులపల్లి సబ్ యార్డులో వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి. మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు కూడా కొనుగోలు చేయాలి. – రేపాకుల శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ డివిజన్ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక ఎర్రగుంట, మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డు, ఇందిరా కాలనీ, నెహ్రూనగర్ ప్రాంతాల్లో రూ.1.7 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ ప్రతీ బస్తీలో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేషన్ అయిన నేపథ్యంలో ఇతర కార్పొరేషన్లకు దీటుగా ఇక్కడ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ దారా ప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, డి.సుధాకర్, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావ్, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్.గిరి, వల్లపు యాకయ్య, గౌస్, రెహమాన్, కరీం, రమేష్, గణేష్, ఆదినారాయణ పాల్గొన్నారు. అనంతరం పాల్వంచ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సూపరింటెండెంట్ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

చుంచుపల్లి: పట్టణ, గ్రామీణ రహదారులు, అంతర్గత రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని, ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోనని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను హెచ్చరించారు. ముర్రేడు బ్రిడ్జి రోడ్డుపై జరుగుతున్న మరమ్మతు పనులను బుధవారం మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. కూనంనేని మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రోడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాల వల్లే ప్రజలకు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించి తక్కువ కాలంలోనే రోడ్లు ధ్వంసమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నట్లు చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్మించాలని, నాణ్యత లోపిస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల విషయంలో రాజకీయాలు తగవని, సమస్య ఉంటే బాధ్యతగల పౌరులుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోస్టాఫీసు సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు, సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి సింగరేణి ప్రధానాస్పత్రి, అదేవిధంగా సింగరేణి మెయిన్ స్టోర్స్ వరకు మూడు రోడ్లను యుద్ధ ప్రాతిపదికన రోడ్ల పునర్నిర్మాణ పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ మూడు రోడ్లకు రూ.2.80కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. రెండో విడతో బస్టాండు సెంటర్ నుంచి త్రిమాత టెంపుల్ వరకు రోడ్డు పునర్నిర్మాణం, రోడ్డు వెడల్పు, బస్టాండ్ సెంటర్‌లో హైమాస్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. కూనంనేని వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఆర్‌అండ్‌బీ అధికారులు, లగడపాటి రమేష్, దేవరగట్ల రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి బోనస్ చెల్లించండి..

కొత్తగూడెంఅర్బన్: గత యాసంగి ధాన్యానికి తక్షణమే బోనస్ చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామంలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ గత యాసంగి సీజన్‌లో జిల్లాలో 3.69 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని, ఇందుకు రూ.18.17 కోట్ల మేర రైతాంగానికి ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకొని వెంటనే యాసంగి బోనస్ వచ్చేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో బోనస్ చెల్లించారని, జిల్లా రైతులకు అన్యాయం జరుగుతుంటే వ్యవసాయ శాఖ మంత్రి జిల్లాలో ఉండి ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. ఈ ఏడాది రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, బస్తాలు, మిషన్ల కొరత లేకుండా చూడాలన్నారు. కేజీ తరుగు కూడా లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్, కున్సోత్ ధర్మా, శంకర్, కాత్రాల తిరుపతిరావు, శ్రీను, కిషన్ నాగరాజు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ ఉచిత కోర్సులపై సమీక్ష

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు వీసం రమ వృత్తి శిక్షణ ఉచిత కోర్సులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సేవా సభ్యులు, ట్రైనర్లతో 2025–26 సంవత్సరానికి గానూ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులపై సమీక్షించారు. ఇల్లెందు ఏరియాలో భూనిర్వాసితులకు ఉచిత వృత్తి విద్య కోర్సులు అందరికీ అందేలా చూడాలని, వారి అభివృద్ధికి తోడ్పడాలని, భూములు కోల్పోయిన వారికి మొదట ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కోఆర్డినేటింగ్ ఆఫీసర్ అజయ్, సేవా సెక్రెటరీ ఎల్.సులక్షణ, ట్రైనర్లు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

కొత్తగూడెంఅర్బన్: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను పశువులకు క్రమం తప్పకుండా వేయించాలని పశువైద్య సిబ్బంది తెలిపారు. బుధవారం సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామంలో పశువులకు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేశారు. నెలరోజుల పాటు టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

టేకులపల్లి: రైతులు తమ ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణకు సకాలంలో టీకాలు వేయించి పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని టేకులపల్లి, బోడు పశు వైద్యాధికారులు అనిల్, సతీష్ తెలిపారు. బుధవారం మండలంలో టీకాల కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. నవంబర్ 14 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు..



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందని, రిజర్వేషన్లపై రాజకీయం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సీపీఐ అనుబంధ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బీసీహెచ్‌ఎస్, సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. కేంద్రం తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. సాబీర్‌పాషా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందన్నారు. కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, ఎస్‌కే ఫహీమ్, ధీటి లక్ష్మీపతి, భూక్యా శ్రీనివాస్, గుత్తుల సత్యనారాయణ, చింతల రాజు, గుత్తుల శ్రీనివాస్, రాంబాబు, యూసుఫ్, సత్యనారాయణాచారి, బోయిన విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, బత్తుల సురేష్, జహీర్, కుసపాటి శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచరూరల్: కిన్నెరసాని డ్యామ్‌సైడ్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలోని సమస్యలను ప్రిన్సిపాల్ ఎస్.శ్యామ్‌కుమార్, బుధవారం ఉపాధ్యాయులతో వెళ్లి కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. పాఠశాల సమగ్రాభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ త్వరలో పాఠశాలను సందర్శించి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

షోషకాహారంతో ఆరోగ్యం



ఫ్యూన్‌బస్తీలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మశ్రీ

కొత్తగూడెంటౌన్: తల్లులు, పిల్లలు ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకోవాలని, షోషకాహారమే ఆరోగ్యానికి శ్రీరామరక్షగా ఉంటుందని కొత్తగూడెం సీడీపీఓ పద్మశ్రీ అన్నారు. బుధవారం కొత్తగూడెం ఫ్యూన్ బస్తీలోని అంగన్‌వాడీలో పోషణ్‌మాసం, పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మునగ, బచ్చలి, గోంగూర, తోటకూర, మిల్లెట్స్, ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రతీనెల పిల్లల ఎత్తు, బరువు చూసి, వారు ఏ గ్రేడ్‌లో ఉన్నారో తెలుసుకోవాలన్నారు. గోనెమణి, ఉమాదేవి, ఎస్తేర్, రమణ, వనిత, సరస్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని కేజీబీవీలలో పనిచేస్తున్న వారికి వేతనాలు విడుదల చేయాలని కోరుతూ డీఈఓ నాగలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ వేతనాల కోసం నెలరోజుల క్రితం కూడా వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. స్పందించిన డీఈఓ వివిరాలు తెలుసుకుని శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

ఆర్థిక పురోగతి సాధించాలి

పాల్వంచరూరల్: మహిళలు స్వయంశక్తితో ఆర్థిక పురోగతి సాధించాలని అదనపు డీఆర్డీఓ రవి సూచించారు. నారాయణరావుపేట ఎస్సీ కాలనీలో భారతీయ స్టేట్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ అధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పూర్తి చేసిన మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డీఎల్‌ఆర్సీ దార రాజారత్నం, ఎస్‌బీఎం కన్సల్టెంట్ రేవతి, ఏపీఓ రంగా పాల్గొన్నారు.

కెపాసిటర్లు అమర్చుకోవాలి

పాల్వంచరూరల్: రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ రవీందర్ అన్నారు. సూరారం గ్రామంలో బుధవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు అమర్చడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, రైతులు స్వయంగా రిపేర్లు చేసుకోకూడదన్నారు.

బిల్లులు చెల్లించండి..

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బిల్లులు చెల్లించకుండా విద్యను దూరం చేస్తూ వారిపై వివక్ష చూపుతోందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ విమర్శించారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గుగులోత్ సాయితేజ, చైతన్య, హరిరావు, పునీత్ కుమార్, సాయి ధనుష్, హేమంత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

చుంచుపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా గుంతలు తేలిన లక్ష్మీదేవిపల్లి ముర్రేడు వాగుపై బ్రిడ్జి రహదారిపై సాక్షిలో వచ్చిన కథనాలకు మొదట స్థానిక యువకులు స్పందించి గుంతలను పూడ్చి వేసిన విషయం తెలిసిందే. బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రంగంలోకి దిగి మరమ్మతులు చేపడుతున్నారు. మరమ్మతుల బాధ్యతలు నేషనల్ హైవే అధికారులు చూడాల్సి ఉండగా, ఆ శాఖ చేతులెత్తేయడంతో కలెక్టర్ చొరవతో ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతు పనులు చేస్తున్నారు. బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంతలను మొదట కాంక్రీట్‌తో నింపి తరువాత తారు వేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారిపై పడిన భారీ గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేస్తుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన దంతవైద్య సేవలు

- డాక్టర్ లేక రోగుల అవస్థలు
- మూలనపడిన పరికరాలు



జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



నిరుపయోగంగా చికిత్స పరికరాలు

జూలూరుపాడు: జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డెంటల్ యూనిట్‌లో వైద్యసేవలు నిలిచిపోయాయి. మూడు నెలలుగా రోగులకు దంత సేవలు అందడం లేదు. తొమ్మిదేళ్ల క్రితం పీహెచ్‌సీలో డెంటల్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అంతకముందు సీహెచ్‌సీ కిందనే డెంటల్ డాక్టర్ ఉన్నప్పటికీ యంత్ర పరికరాలు లేకపోవడంతో దంత వైద్యసేవలు అందుబాటులోకి రాలేదు. ఆ తరువాత అప్పటి కలెక్టర్ చొరవతో రూ.7.50 లక్షల యంత్ర పరికరాలకు మంజూరు చేయడంతో డెంటల్ యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దంత వైద్యనిపుణుడు పోటు వినోద్‌కుమార్ రోగులకు సేవలు అందించారు. ఆయన అరుదైన శస్త్రచికిత్సలు చేశారు. 2024 జూలైలో జరిగిన బదిలీల్లో డాక్టర్ వినోద్ కుమార్ మల్కాజ్‌గిరి పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో బూర్గంపాడు సీహెచ్‌సీ నుంచి వైద్యురాలు అనిత జూలూరుపాడు పీహెచ్‌సీకి వచ్చారు. కొద్దిరోజులు మాత్రమే ఆమె వైద్య సేవలు అందించి, అనంతరం డిప్యూటేషన్‌పై తిరిగి బూర్గంపాడు సీహెచ్‌సీకి వెళ్లారు. అయితే బదిలీ అయిన స్థానానికి తిరిగి డిప్యూటేషన్‌పై వెళ్లే అవకాశం లేనప్పటికీ ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియని విషయం కాదు. అయినప్పటికీ ఆమె బూర్గంపాడు ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడి దంత సేవలు అందించే వారు కరువయ్యారు. ఆ తరువాత కాంట్రాక్టు పద్ధతిలో ఇద్దరు దంత వైద్యనిపుణులను నియమించగా, వారంలో ఒకరు మూడు రోజులు, ఇంకొకరు మరో మూడు రోజులు విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఆ తరువాత ఒక్కరే దంత సేవలు అందించడం జరిగింది. మూడు నెలల క్రితం దంత వైద్యురాలు మెటర్నిటీ లీవ్‌పై వెళ్లడంతో సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంటల్ యూనిట్లు తక్కువగా ఉండటం, జూలూరుపాడు పీహెచ్‌సీలో డెంటల్ యూనిట్‌లో ఉచితంగా శస్త్రచికిత్స చేస్తుండటంతో స్థానికులే కాకుండా దూర ప్రాంతాల రోగులు సైతం ఇక్కడికి వస్తున్నారు. కానీ ప్రస్తుతం డెంటల్ డాక్టర్ లేకపోవడంతో రోగులు ఆస్పత్రికి వచ్చి నిరాశతో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షల విలువైన యంత్ర పరికరాలు ఉపయోగించే డెంటల్ డాక్టర్ లేకపోవడంతో అవి మూలనపడ్డాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన దంతవైద్య సేవలు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డాక్టర్‌ను నియమించాలి..




డెంటల్ డాక్టర్‌ను నియమించి, దంతవైద్య సేవలు అందుబాటులోకి తేవాలి. దంత సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తే డాక్టర్ లేరని చెబుతున్నారు. డాక్టర్ లేకపోవడంతో కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. – జాలాది మంగమ్మ, వెంగన్నపాలెం

దంత వైద్యం అందడం లేదు..



రోగులకు దంతవైద్య సేవలు అందడం లేదు. ఏడాది కాలంగా స్థానికులు, చుట్టుపక్కల మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో డాక్టర్ అందుబాటులో ఉంచి వైద్యసేవలు అందించేవారు. కానీ ఇప్పుడు అలా లేదు. ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్‌ను నియమించి సేవలను పునరుద్ధరించాలి. – భూక్యా జ్యోతి, జూలూరుపాడు

వైద్యులు లేకపోవడంతో..



జూలూరుపాడు పీహెచ్‌సీలోని డెంటల్ యూనిట్‌లో ఆగస్టు నుంచి వైద్యసేవలు నిలిచిపోయాయి. వైద్యురాలు అనిత డిప్యూటేషన్‌పై బూర్గంపాడు సీహెచ్‌సీకి వెళ్లారు. ప్రస్తుతం పని చేస్తున్న వైద్యురాలు మెటర్నటీ లీవ్‌లో ఉండటంతో డెంటల్ సేవలు అందడం లేదు. – డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, జూలూరుపాడు

అందరూ పర్యావరణ దూతలుగా మారాలి



స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రాజెక్టు ఆఫీసర్

పాల్వంచరూరల్: మారుతున్న కాలంలో ప్రతీఒక్కరు పర్యావరణ దూతలుగా మారాలని ఎకో బజార్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, ఎంఓఈ ఎఫ్‌సీసీ, మల్టీపర్పస్ అవేర్‌నెస్ సొసైటీ, డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎకో బజార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాల, రామచంద్ర డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ, గిరిజన డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొని 20 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రాజెక్టు ఆఫీసర్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎకో బజారులో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఫుడ్స్, ఔషధ మొక్కలు, జూట్ ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, సహజ దీపాలను పరిశీలించారు. మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత ఇందుకు యువత ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, సహజ పదార్థాల వినియోగం పెంచడం, పునర్వినియోగ పద్ధతులను అవలంభించడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా సుస్థిర అభివృద్ధికి దారి తీస్తుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ భవిష్యత్ పచ్చదనం మీద ఆధారపడి ఉందని, విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటూ మొక్కలను నాటి పచ్చదాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేముల కామేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జె.మాధవి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కొండల్‌రావు, డాక్టర్.అరుణకుమారి, డి. రమేష్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన సింగరేణి విద్యార్థినులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పర్యావరణ అటవీ, భారత ప్రభుత్వ వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పాల్వంచ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన 'క్యాంపస్ ఎకో బజార్ – 2025' ప్రోగ్రాంలో స్థానిక సింగరేణి మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థినులు ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకున్నారు. వారిని బుధవారం కళాశాలలో సెక్రటరీ ఎస్ వెంకటాచారి, కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద అభినందించారు.